సాక్షి
చిత్తూరు
సోమవారం । 7 । జూలై । 2025



ఉరేసుకోమంటారా..!?
ప్రత్యామ్నా య పంటలు సాగు చేయకుండా టీడీపీ నేతలు అడ్డుపడుతుండడంతో మామిడి రైతులు అవస్థలు పడుతున్నారు. - 8లో



విధ్వంసక కూటమిని ఎదుర్కొందాం
రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిస్తున్న ఈ కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కొందామని విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



బోయకొండ కిటకిట
పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం పొరుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

9న సార్వత్రిక సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జిల్లాలో సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆదివారం ఐసీడీఎస్ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా పాలన సాగిస్తోందన్నారు. దీనికి నిరసనగా చిత్తూరులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సార్వత్రిక సమ్మె చేపడుతున్నామన్నారు. ఈ సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల జాబితాపై బీఎల్‌వోలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఎల్‌వో (బూత్ లెవల్ ఆఫీసర్)లకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ ఈ నెల 5 నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఇచ్చేలా కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఈఆర్‌వోల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు 50 మందికి మించకుండా శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ శిక్షణలో ఎన్నికల ఓటర్ల జాబితాలో చేపట్టాల్సిన చర్యలను బీఎల్‌వోలకు క్షుణ్ణంగా వివరించనున్నారు.

అయ్యో..అధ్యాపకులు

జిల్లాలో ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి అయోమయంగా మారింది. మూడు నెలలుగా జీతాలు లేక ఈ ఏడాదికి పొడిగింపు (రెన్యూవల్) ఉత్తర్వులు అందక కుటుంబ పోషణ భారమై అగచాట్లు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసేందుకు జీవో 114 విడుదల చేసింది. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. అనంతరం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం అధ్యాపకుల రెగ్యులైజేషన్ ఉత్తర్వులను తుంగలో తొక్కి వారి జీవితాలతో చెలగాటమాడుతోంది.

- ప్రశ్నార్థకంగా కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి
- ఉద్యోగ భద్రత కరువు..బతుకు భారం
- ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అందని రెన్యూవల్ ఉత్తర్వులు
- తరగతులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- మూడు నెలలుగా అందని వేతనాలు
- దయనీయ స్థితిలో కాంట్రాక్టు అధ్యాపకులు



జిల్లా సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	78
టీటీడీ డిగ్రీ కళాశాలలు	5
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	132
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	66
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	521
టీటీడీ జూనియర్ కళాశాలలు	3
పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు	52
డిగ్రీ కళాశాలలో రిటైర్‌మెంట్‌కు చేరువలో ఉన్న తాత్కాలిక అధ్యాపకులు	75
జూనియర్ కళాశాలలో రిటైర్‌మెంట్‌కు చేరువలో ఉన్నవారు	37

అసెస్‌మెంట్ల పేరుతో కాలయాపన

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ కళాశాలలో 50 నుంచి 60 శాతం మంది కాంట్రాక్టు అధ్యాపకులే పనిచేస్తున్నారు. కళాశాలల నిర్వహణలో నాణ్యమైన విద్యను అందించడంలో వీరిదే ప్రధాన పాత్ర. అధ్యాపకులందరూ ఎంతో పనితీరును ప్రదర్శిస్తే గానీ నాక్ ఏ ప్లస్ గ్రేడ్లు, అటానమస్ హోదాలు రావడం కష్టసాధ్యం. కానీ ప్రభుత్వం ఏటా కాంట్రాక్టు లెక్చరర్ల పనితీరును పరీక్షించడానికి ఎన్నడూ లేని విధంగా అసెస్‌మెంట్ పేరుతో రెండు, మూడు నెలలు కాలయాపన చేసి రెన్యూవల్స్ ఇస్తూ అధ్యాపకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

తిరుపతి సిటీ : ప్రభుత్వ, టీటీడీ డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల భద్రత కరువై బతుకు భారంగా మారింది. కళాశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులకు తప్ప మిగిలిన డిగ్రీ, టీటీడీ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ రెన్యూవల్ ఆర్డర్స్ ఇచ్చిన పాపాన పోలేదు. 2025–26 అకడమిక్ ఇయర్ కోసం ప్రస్తుతం పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులను కొనసాగించాల్సి ఉండగా ప్రభుత్వం ఆ మేరకు అడుగులు వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో అధ్యాపకులు మే నుంచి జులై వరకు మూడు నెలల జీతాలకు నోచుకోలేదు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 2002 నుంచి పలు డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సుమారు 800 మందికి పైగా అధ్యాపకులు ఉద్యోగ భద్రత కరువై చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారు.

గత ప్రభుత్వం పర్మినెంట్‌కు ఆదేశాలిచ్చినా..

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు 2024లో జీఓ 114 విడుదల చేసి ప్రక్రియ శరవేగంగా కొనసాగుతున్న తరుణంలో సాధారణ ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కింది. కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను పక్కన పెట్టి డిగ్రీ అధ్యాపకుల నియామకాల కోసం ఏపీపీఎస్సీ ద్వారా నియమించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో కాంట్రాక్ట్ అధ్యాపకుల పరిస్థితి అయోమయంలో పడింది. రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన అధ్యాపకులతో తాత్కాలిక అధ్యాపకుల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది. కొంత మంది అధ్యాపకులు గత 22 సంవత్సరాలుగా పనిచేసినప్పటికీ రెగ్యులర్ చెయ్యకపోవడం కనీసం టైం స్కేల్ కూడా ఇవ్వకపోవడం దారుణం.

రిటైర్‌మెంట్‌కు దగ్గర పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

జిల్లాలో ప్రభుత్వ, టీటీడీ కళాశాలలో 22 ఏళ్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రతకు నోచుకోలేక సతమతమతం అవుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. పలు డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సుమారు 75 మంది తాత్కాలిక అధ్యాపకులు రెండు, మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అటు పర్మినెంట్ చేయకపోగా ప్రస్తుతం ఉన్న ఉద్యోగాన్ని కొనసాగించకపోవడంతో వారికి ఎటూ పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏటా 12 నెలల పాటు అధ్యాపకుల చేత సేవ చేయించుకుని కేవలం 10 నెలల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. దీనికి తోడు వేతనాలు సరైన సమయానికి అందించకుండా మూడు, నాలుగు నెలలకు ఒకసారి అందిస్తున్నారు.

ఏటా నాలుగు నెలల నిరీక్షణ

గతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులకు అకడమిక్ ఇయర్ ప్రారంభం నాటికి రెన్యూవల్ ఆర్డర్స్ వచ్చేవి. గత ఏడాది నుంచి పరిస్థితి దారుణంగా తయారైంది. కానీ కళాశాలలు పునఃప్రారంభం అయ్యే నాటికి కాకుండా మూడు నెలలు ఆలస్యంగా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం నాలుగు నెలలు జీతభత్యాలు ఆలస్యమవడంతో ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. ప్రక్రియ పూర్తయే వరకు నూతన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలి. ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి సంబంధించి తాత్కాలిక అధ్యాపకులను కొనసాగిస్తూ ఉత్తర్వులు తక్షణం జారీ చేయాలి. దీంతో పాటు కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్న సబ్జెక్టులకు వదిలేసి ఖాళీగా ఉన్న సబ్జెక్టులకు మాత్రమే నూతన రిక్రూట్‌మెంట్ ద్వారా అధ్యాపకుల ఎంపిక చేయాలి.
– డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకులు, తిరుపతి జిల్లా

వరసిద్ధుని బ్రహ్మోత్సవానికి
ముహూర్తం ఖరారు



కాణిపాక దేవస్థానం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 27వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వినాయకచవితి రోజు నుంచే ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 28న ధ్వజారోహణం, హంసవాహనం, 29న బంగారు నెమలి వాహనం, 30న మూషికవాహనం, 31న బంగారు చిన్న, పెద్ద శేష వాహనం, సెప్టెంబర్ 1న చిలుక వాహనం, వృషభవాహనం, 2వ తేదీ గజవాహనం, 3న రథోత్సవం, 4న తిరు కల్యాణం, 5న ధ్వజారోహణం, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు. ఆపై ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 6వ తేదీ అధికార నంది వాహనం, 7న రావణబ్రహ్మ వాహనం, 8న యాళి వాహనం, 9న సూర్యప్రభ వాహనం, 10న చంద్రప్రభ వాహనం, 11న కల్పవృక్ష వాహనం, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి, 14న కామధేను వాహనం, 15న పూలంగిసేవ, 16న తెప్పోత్సవం ముగియనున్నట్లు ఆలయ ఈవో పెంచల కిషోర్ పేర్కొన్నారు.

సుపరిపాలన కాదు.. ఇది దుర్మార్గ పాలన



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, కృపాలక్ష్మి, పార్టీ నాయకులు

పాలసముద్రం : ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అన్ని వర్గాలను దారుణంగా మోసగించిన కూటమి ప్రభుత్వం దుర్మార్గ పాలన సాగిస్తూ.. సుపరిపాలన అంటూ ప్రజల్లోకి వెళ్లడం హాస్యాస్పదమని మాజీడిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, జీడీ నెల్లూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి దుయ్యబట్టారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణస్వామి, కృపాలక్ష్మి, పార్టీ నాయకులతో కలసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ ఏడాదిలో ఏం సాధించారో చెప్పే దమ్ము కూటమి నేతలకు ఉందా అంటూ ప్రశ్నించారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జనాల్లోకి రానివ్వకుండా ఈ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్పాప్రకాష్, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, అనురేఖ, మహేష్ బాబు, అయ్య ప్ప, జీవిత, నరసింహులురాజు, ఎంపీటీసీలు గోవిందరాజ్, లిఖిత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధనంజయులతోపాటు నాయకులు పాల్గొన్నారు.

అసలు సిసలైన నాయకుడు జగనే

- హామీలిచ్చి విస్మరించిన చంద్రబాబు ఎప్పటికీ మోసగాడే
- ఇది ప్రజలకు తెలియజేయడమే రీకాలింగ్ మేనిఫెస్టో ఉద్దేశం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన, మాజీ మంత్రి రోజా



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, పార్టీ నాయకులు

నగరి : అట్టడుగు ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన అసలు సిసలైన ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. నగరిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన మాజీ మంత్రి ఆర్‌కే రోజాతో కలిసి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. భూమన మాట్లాడుతూ మోసపూరిత మేనిఫెస్టోతో చంద్రబాబు ప్రజలను బురిడీ కొట్టించారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్ రెడ్డి నెరవేరిస్తే అంతకన్నా ఎక్కువ చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పింఛన్ తప్ప ఏమీ అందిచలేదన్నారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి భయపడి 30 లక్షల మందికి కోతలు పెట్టి తల్లికి వందనం అమలుచేశారని దుయ్యబట్టారు. 3 అంకణాలకు మించి ఉన్నా, రూ.300 విద్యుత్ బిల్లు ఉన్నా రూ.8,020 మాత్రమే వేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి సంతకాలు చేసిన బాండ్లు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని చెప్పారు. గెలిచాక యథాప్రకారం ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్ని హామీలు ఇచ్చారు ఏవి అమలు చేయలేదు అని క్షేత్రస్థాయి వరకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమ ఉద్దేశమన్నారు. జగనన్న చేసిన మంచిని చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు తెలియజెప్పడం ప్రతి కార్యకర్త బాధ్యతన్నారు.

సనాతన యోధుడు ఏమయ్యాడు

తిరుమలలో దేవుడితో సమానమైన గోవుని కాపాడుకోలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, శ్రీకూర్మంలో తాబేళ్లు చనిపోతున్నాయని వీటిపై సనాతన యోధుడు పిఠాపురం పీఠాధిపతి పవన్ ఎందుకు స్పందించడం లేదని మాజీ మంత్రి రోజా ప్రశ్నించారు. ఆయన తమిళనాడుకెళితే తాను అక్కడే పుట్టానంటాడు.. గుంటూరుకు వెళితే అక్కడా పుట్టానంటాడు.. పిఠాపురం వెళితే అక్కడే పుట్టానంటున్నాడు.. అసలు ఆయన ఎక్కడ పుట్టాడో ఆయనకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. అందరూ వీకెండ్‌కు వెకేషన్‌కు వెళితే, పవన్ వీకెండ్‌కు మాత్రమే రాష్ట్రానికి వస్తారన్నారు. ఎవరు రాష్ట్రానికి మంచిచేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, విజయలక్ష్మి, దీప, వైస్‌చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పవన్ తిక్కకు బాబు లెక్కలు

పవన్ తిక్కకు చంద్రబాబు వద్దే లెక్కుందని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ముఖ్యమంత్రిగా ఉండి అన్నీ హామీలు నెరవేర్చేశానని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంతమంది ఉంటే అంత మందికి జగన్ చేసిన సంక్షేమం కన్నా ఎక్కువ చేస్తాం అంటూ ఎన్నికల బీరాలు పలికిన బాబు నేడు దీన స్వరంతో పథకాలు తలచుకుంటే భయమేస్తోందంటున్నారని ఆయన నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చని పేర్కొన్నారు. ఆయనకు నిజం చెబితే తల పగిలే శాపం ఉందేమో అన్నారు. అందుకే ఆయన అబద్ధాలు మాత్రమే చెబుతారంటూ ఎద్దేవా చేశారు. బాబు చంకలో కూర్చున్న పవన్ తానే టీడీపీని అధికారంలోకి తెచ్చానంటుంటే, తాము లేకుంటే పవన్ ఎమ్మెల్యేగా కూడా గెలవరని టీడీపీ చెబుతోందని, ఇలాంటి నాయకులందరూ కూటమిగా కొనసాగుతుండడం దౌర్భాగ్యమన్నారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే వారిని కఠినంగా శిక్షించే చట్టాలు తెస్తానన్నారు. ఇంత మంది ఆడపిల్లలు అఘాయిత్యాలకు బలవుతున్నా నోరుమెదపడం లేదేమిటని ప్రశ్నించారు. పవన్‌కు చంద్రబాబు చూపే గ్రాఫిక్స్ తప్ప మిగతా విషయాలు ఏవీ కనబడవన్నారు.

నిర్బంధ విధానం సరికాదు



రెడ్డిశేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం టీచర్ల పట్ల నిర్బంధ విధానం అమలు చేయడం ఏ మాత్రం సరికాదని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ఎక్కువగా అమలు చేయడం అన్యాయమన్నారు. బోధనేతర పనుల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడి, అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. బోధన పట్ల ఏకాగ్రత కరువవుతోందని చెప్పారు. మెగా పీటీఎం పేరుతో పాఠశాలల్లో 17 కమిటీలు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యాశక్తి, ఆన్‌లైన్ కోర్సులు, తల్లికి వందనం పోటీలు, గ్రీన్ టైల్ నమోదు, వీడియోలు రికార్డు చేయడం వంటి అదనపు ఒత్తిళ్లు ప్రభుత్వ ఉపాధ్యాయులపై నెట్టడం అన్యాయమన్నారు.

వైఎస్సార్ అంతరాత్మ 'తెలుగు'



సన్మానం పొందిన రచయితలు, సంఘ సేవకులతో నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దివంగత ముఖ్యమంత్రి డా వై.ఎస్.రాజశేఖరరెడ్డి అంతరాత్మ తెలుగుభాష అని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షులు మద్రిపూడి దేవేంద్రరావు అన్నారు. నగరంలోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో 'తెలుగుభాషాభిమానం – వైఎస్సార్ అంతరంగం'పై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తెలుగుభాషకు ప్రాచీన పరంగా తెచ్చిన తెలుగుతల్లి ముద్దుబిడ్డగా వైఎస్సార్ ఖ్యాతికెక్కారని చెప్పారు. పల్లెసోయగాలు ఉట్టిపడే పంచెకట్టుతో తేట తెలుగు నడికారపు పలుకుల పలకరింపులు ఒక్క వైఎస్సార్‌కే దక్కిందన్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు తోట గోవిందన్ మాట్లాడుతూ అనితర సాధ్యమైన సేవలను ఆంధ్రావనిలోని ప్రతిగుండెకు చేరవేసిన రాజన్న యుగం చిరస్మరణీయమన్నారు. అనంతరం రాజన్న పరిపాలనపై కవిసమ్మేళనం నిర్వహించారు. 20 మంది రచయితలను, సంఘసేవకులను దేవేంద్రరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయితలు శ్రీరాజు, ఎస్.మునీంద్ర, రమేష్ బాబు, తెలుగు భాషాభిమానులు కోటేశ్వ ర మొదలియార్, డి.రోహిత్, జి.లక్ష్మీపతి, చిట్టిబాబు, భూపతి, ఎం.దినకరన్, రాజేంద్రన్, మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలిన విద్యుత్ దీప స్తంభం



చిత్తూరు అర్బన్: నగరంలోని గాంధీ రోడ్డు కూడలిలో అర్ధరాత్రి విద్యుత్ దీపస్తంభం కుప్ప కూలింది. శనివారం అర్ధరాత్రి తరువాత ఓ లారీ వేగంగా వచ్చి దాదాపు వంద అడుగుల ఎత్తు ఉన్న విద్యుత్ దీప స్తంభాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభం రోడ్డుపైనే కూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జంతువుల నుంచి మనుషులకు సోకే రేబిస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ అబ్దుల్ ఆరీఫ్ తెలిపారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక పశువైద్యశాలలో శునకాలకు ఉచిత టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జంతువులు, పక్షుల నుంచి మనుషులకు 280 రకాల వ్యాధులు వ్యాపించే వీలుందని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జూనోసిస్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పశువైద్య శాలల్లో 23,440 ఉచిత డోస్‌ల టీకాలు శునకాలకు వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 2,942 డోసుల టీకాలు వేశామన్నారు. ఉచిత టీకాల ప్రక్రియ స్టాక్ ఉన్నంత వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లోకేష్, పశువైద్యాధికారిణి సుబ్బమ్మ పాల్గొన్నారు.

మామిడి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వరు.. ధర ఇవ్వకపోతే పోనీ పంట అయినా కొంటారా అంటే అదీ కుదరదట. సరేలే అయితే తమ పొలంలో మామిడికి బదులు వేరే పంట వేద్దామనుకుని చెట్లను తొలగిస్తే కేసులు పెడతారట. ఇదేం న్యాయం.. పట్టా భూమిలో ఉన్న మామిడి చెట్లు తొలగిస్తే అటవీ శాఖ అధికారులు జరిమానా వేస్తారట. లేకుంటే కేసులు తప్పవట.. ఇదేం ప్రభుత్వం. ఇక మామిడి రైతులు ఉరేసుకోవల్సిందేనా..? జిల్లాలో మామిడి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



తవణంపల్లె మండలంలో మామిడి చెట్లను తొలగించిన దృశ్యం

ఉరేసుకోమంటారా..!?

- ధర ఇవ్వరు.. కాయలు కొనరు..
- అయినా మామిడి పంట పండించాలంట
- చెట్లు తొలగిస్తే కేసుల నమోదు
- దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతలు కొందరు మామిడి రైతులపై పగబట్టారు. మామిడి రైతుల పీక నొక్కుతున్నారు. మామిడి పంట తొలగిస్తే నేరమంటున్నారు. కక్షగట్టి వేధిస్తున్నారు. అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కేసులు, జరిమానాల పేరుతో రైతులను భయపెడుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలకు పొగ పెడుతున్నారు. దీనిపై వివిధ పార్టీ నేతలు, రైతు సంఘం నేతలు మండిపడుతున్నారు. మామిడి పంటకు ఆంక్షలు ఏమిటని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మామిడి చెట్టు పూతకు వచ్చినప్పటి నుంచి కాయలు పక్వానికి వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకున్నారు.. మంచి దిగుబడి వచ్చింది. ఆ సారి కొంచెం లాభాలైనా కళ్ల చూడచ్చని అనుకున్నారు. మామిడి కాయలు కోతలు మొదలయ్యాక తెలిసింది అసలు ధరల్లేవు అని.. ప్రభుత్వం ఒక వైపు అధికారులు మరోవైపు రోజుకో ధర ప్రకటిస్తుంటే, ఫ్యాక్టరీలు మాత్రం అసలు కాయలే కొనం అంటూ మొండికేశాయి. ఈ క్రమంలోనే మామిడి కాయల ట్రాక్టర్లు ఫ్యాక్టరీల ముందు బారులు తీరాయి. రోజులు గడిచిపోతున్నా ట్రాక్టర్లు మాత్రం అన్‌లోడ్ కావడం లేదు. ట్రాక్టర్‌లోనే కాయలు పండై కుళ్లి పోయాయి. విధిలేక రోడ్ల పక్కనే పోరబోసి ఖాళీ ట్రాక్టర్లు ఇంటికి చేరాయి. ఈ బాధతో ఇక మామిడి పంటకు బదులు వేరే ఏదైనా సాగు చేసుకుందామని, చెట్లను తొలగించేశారు. అయితే చెట్లను తొలగించే రైతులపై కేసులు పెడుతున్నారు. ఈ తరుణంలో మామిడి రైతులకు కన్నీటి సుడులు మొదలయ్యాయి.



రోడ్డు పక్కనే పోరబోసిన మామిడి పండ్లు

పంట మార్పిడి నేరమా..?

టీడీపీ నేతలు కొందరు ఈ పంట మార్పిడిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. రైతు పండించిన పంటను తొలగించుకునే హక్కు రైతుకు ఉంది. అయితే రైతులపై పగబట్టిన టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి, మామిడి రైతులపై కేసులు పెట్టించి, జరిమానా వేయిస్తున్నారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లుగానే అటవీశాఖ, ఇతర శాఖ అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. వారిని వేధిస్తూ, బలవంతంగా జరిమానా కట్టేలా చేస్తున్నారు. తమ పొలంలో వేరే పంట పండించుకోవాలంటే కూడా కేసులు పెట్టడం ఏమిటో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

రైతులను బతకనివ్వండి



ఏదైతే రైతుకు మంచి దిగుబడి ఇస్తుందో.. ఆ పంట పండించాలనే రైతు తాపత్రాయ పడుతుంటాడు. ఇప్పుడు మామిడి వల్ల రైతుకు ఒరిగింది ఏమి లేదు. ఈ పంట సక్రమంగా రాని పక్షంలో రైతు ప్రత్యామ్నాయంగా చూసుకుంటారు. అంతే కానీ మామిడి చెట్లను కొట్టేస్తున్నారని కేసులు పెట్టడం కరెక్టు కాదు. చిత్తూరులోని కొన్ని కార్యాలయాల్లో చెట్లు కొట్టేస్తున్నారని వీడియోలు తీసి పంపిస్తే ఎవరూ పట్టించుకోలేదు. రైతులను ప్రశాంతంగా బతకనివ్వండి.

– శరవణ, జనసేన పార్టీ నేత, చిత్తూరు

రైతు చనిపోతే బాధ్యతెవరిది



మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కాలేదు. పండిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నాం. విధిలేని పరిస్థితుల్లో వేరే పంట పండించుకోవాలని చూస్తున్నాం. అటవీ శాఖ అధికారులు గ్రీనరీ అంటున్నారు కదా. రైతు అప్పుల పాలై చనిపోతే ఈ అధికారులు బాధ్యత వహిస్తారా? దయచేసి రైతులను ఇబ్బంది పెట్టొద్దు. ఇప్పుడే పీకల్లోతు అప్పుల్లో ఉన్నాం. చెట్టు కొట్టేస్తున్నారని జరిమానాలు, కేసులు పేరుతో మమ్మల్ని వేధించొద్దు.

– కొత్తూరు బాబు నాయుడు, రైతు నాయకుడు, చిత్తూరు

పంట మార్పిడికి అనుమతేంటి?



అతని పొలంలో అతను మామిడి చెట్లు పెట్టుకున్నారు. పంట బాగా వచ్చి లాభాలుంటే ఏ రైతూ పంటను నేల మట్టం చేయడు. నష్టం వస్తే ప్రత్యామ్నాయం చూసుకుంటాడు. అది రైతు ఇష్టం. గ్రీనరీ పేరుతో రైతులను అధికారులు వేధిస్తే ఎలా? అలా అనుకుంటే అన్ని రకాల పంటలు గ్రీనరీనే కదా. అప్పుడూ ఏ పంటనూ కోయకూడదు. పంట మార్పిడికి అనుమతి తీసుకోవాలనడం విచిత్రంగా ఉంది. దీనిపై ప్రభుత్వం స్పందించాలి. రైతులను ఇబ్బంది పెడితే. తిరగబడడం ఖాయం.

– నాగరాజు, సీపీఐ నాయకులు, చిత్తూరు

బోయకొండ కిటకిట



అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయంలో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి దీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఉద్యమంలా తెలుగు భాషా పరిరక్షణ



పురస్కారాలను అందుకున్న సాహితీ అభిమానులు, కవులు, విద్యార్థులతో నిర్వాహకులు

పలమనేరు: తెలుగుభాష, సంస్కృతి పరిరక్షణకు సాహితీవేత్తలు ఓ ఉద్యమంలా ముందుకెళ్లాలని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి సూచించారు. పట్టణ సమీపంలోని కళామందిరం మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం నేటి తరంపై ఉందన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లు పక్కనబెట్టి పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని సూచించారు. కర్ణాటకకు చెందిన శాస్త్రవేత్త రమేష్, కడప జానమద్ది సాహితీపీఠం నిర్వాహకులు విజయభాస్కర్ ప్రసంగించారు. నిర్వాహకులు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో నీతిని ప్రతిబింబించేందుకు నీతి పద్యాలు ఎంతో తోడ్పడతాయన్నారు. వందకు పైగా నీతి పద్యాలను చెప్పిన 50 మంది చిన్నారులకు వారు బహుమతులను అందజేశారు. సాహితీ రంగంలో ప్రతిభ చూపుతున్న చింతకుంట శివారెడ్డి, ఏనుగు అంకమనాయుడు, మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, మాధవి, నడ్డి నారాయణ, ప్రకాష్‌రెడ్డి, సాంభయ్య, విజయలక్ష్మి, రంభ, హేమాద్రి, సుధాకర్, శాంతా భాస్కర్, ఆళ్ళ నాగేశ్వరావుకు వార్షికోత్సవ పురస్కారాలను అందజేశారు. డాక్టర్ మౌని రచించిన భిన్న ధ్రువాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన డా.రజని భరత, కూచిపూడి నాట్యాలు అందరినీ అలరించాయి. ఇందులో పుష్ప, ధనుంజయ, డా.మాధవి, రమ్య, భారతి, జమున, పలమనేరు బాలాజీ, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: మామిడి రైతులకు అండగా నిలిచేందుకు మండలానికి విచ్చేయనున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలేరు గ్రామంలో ఆదివారం సాయంత్రం మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ఈ నెల 9న మామిడి మార్కెట్‌ను సందర్శించి రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వస్తున్నారని చెప్పారు. ధరలు లేక తోటల్లో కాయలు నేలరాలిపోతుంటే రైతులు కంట తడి పెట్టుకున్నట్లు తెలిపారు. మామిడి రైతులు పడుతున్న కష్టాలు కూటమి నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సర్దార్, జిల్లా పార్టీ కార్యదర్శులు గోవింద రాజులు, ప్రకాష్‌రెడ్డి, వడ్డెర, ఈడిగ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్లు మొగిలీశ్వర్, ఎల్లప్ప, నియోజవర్గ రైతు విభాగం అధ్యక్షులు పాలాక్షిరెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు అరుణామల్‌రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాకీర్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు వాణీప్రియ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మాలతి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అరుణ సారిక

చిత్తూరు అర్బన్: జిల్లాలోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంపై ప్రతి ఒక్క న్యాయమూర్తి దృష్టి పెట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఆదేశించారు. చిత్తూరు కోర్టు భవనంలో ఆదివారం చిత్తూరు పూర్వపు ఉమ్మడి జిల్లా న్యాయాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. గత నెలాఖరు నాటికి జిల్లాలో 96,739 పెండింగ్ కేసులు ఉండగా, ఇందులో 48,751 సివిల్, 47,988 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఇంత పెద్ద మొత్తంలో కేసులు పెండింగ్ ఉండడంపై రాష్ట్ర హైకోర్టు సైతం గమనిస్తోందన్నారు. ప్రధానంగా వృద్ధులకు సంబంధించిన కేసులు, అనుమతి లేని విచారణ ఖైదీల కేసులపై దృష్టి సారించాలన్నారు. న్యాయస్థానాలు జారీ చేసిన వారంట్లు ఏ మేరకు అమలు చేశారో సరి చూసుకోవాలన్నారు. జిల్లాలోని సీనియర్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులకు పెండింగ్ కేసులు పరిష్కరించడానికి లక్ష్యాలు కూడా నిర్ణయిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తులు హాజరయ్యారు.


ఏరియా ఆస్పత్రిలో యువకుడి హల్‌చల్



యువకుడిని కట్టేసిన స్థానికులు

పలమనేరు: మద్యం మత్తులో ఉన్న యువకుడు సైకోలా మారి హల్‌చల్ చేసిన సంఘటన పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. దండపల్లి మండలం కురప్పల్లెకు చెందిన భాను(25) భార్యతో కలిసి పట్టణంలోని గాంధీనగర్‌లో నివసిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్యపై దాడిచేశాడు. దీంతో ఆమెను బంధువులు స్థానిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే భర్త ఆస్పత్రికి వచ్చి మరీ భార్యతో గొడవపడి గట్టిగా కేకలు పెడుతూ చొక్కా తీసిపడేసి, అక్కడున్న వారిని తరుముకున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని అతడిని కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడున్న వారు యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి ఓ చెట్టుకు కట్టేశారు.

భక్తులపై హిజ్రాల దాడి



హెడ్ కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేస్తున్న భక్తులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనం కోసం ఆటోలో వచ్చిన ఐదుగురు భక్తులు అడిగినంత డబ్బులు ఇవ్వలేదని హిజ్రాలు వారిపై దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు, బెంగళూరుకు చెందిన దేవరాజు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆటోలో బోయకొండకు బయల్దేరారు. బోయకొండ సమీపంలోని మేకలవారిపల్లె వద్ద రోడ్డుపై వెళ్తున్న వాహనాలను హిజ్రాలు ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే వారు ఇవ్వకుండా అక్కడి నుంచి బోయకొండ రణభేరి గంగమ్మ ఆలయం సమీపం వద్దకు వచ్చారు. అక్కడే ఉన్న మరి కొందరు హిజ్రాలు డబ్బులు ఇచ్చి ఆటో ముందుకెళ్లాలని పట్టుబట్టారు. వారు అడిగినంత ఇవ్వలేదని బూతులు తిడుతూ, ఆటోలో ఉన్న దేవరాజు, మంగమ్మ, భవాని, లిఖిత, నారాయణస్వామి లపై హిజ్రాలు దాడిచేసి గాయపరిచారు. వారు కేకలు వేయడంతో అక్కడే ఉన్న మరికొందరు భక్తులు వారిని రక్షించారు. అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌కు భక్తులు ఫిర్యాదు చేశారు.

విధ్వంసక ‘కూటమి’ని ఎదుర్కొందాం



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అధికారం చేపట్టినప్పటి నుంచి విధ్వంసక పాలన సాగిస్తున్న ఈ మోసపూరితమైన ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కొందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు మండలం పాలంతోపు గ్రామంలో ఆదివారం ‘బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధాలకు మారు పేరు చంద్రబాబు అన్నారు. బాబు మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చారని, తీరా ప్రజలకు చేసేంది ఏమిలేదన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి నేతలు దౌర్జన్యాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని చెప్పారు. ఇళ్లు, ఆస్తులు, పంటలు ధ్వంసం చేసి సామాన్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల రక్తాన్ని కళ్లచూశారన్నారు. పార్టీ పిలుపు మేరకు ఈ అరాచకాలు, తప్పుడు హామీలపై ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. ప్రతి గడపలోకి వెళ్లి కూటమి మోసాన్ని వివరిద్దామన్నారు. రైతులను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని బూచి చూపించి చివరకు నడి రోడ్డుపై వదిలేశారన్నారు. ఈ బాధలు తట్టుకోలేక ఓ రైతు మామిడి చెట్లు తొలగించి ప్రత్యామ్నాయం చూసుకుంటే ఆ రైతుకు అటవీశాఖ అధికారులు జరిమానా విధించడం విడ్డూరమన్నారు. ఇలా జిల్లాలో మామిడి రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకోవడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న బంగారుపాళ్యంకు వస్తున్నారన్నారు. ఆయనకు జిల్లాలోని ప్రతి రైతు స్వాగతం పలకాలని కోరారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయపాల్, జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, నాయకులు సంపత్, అమర్‌నాథ్‌రెడ్డి, త్యాగరాజులు రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, వేలుస్వామి, రాబర్ట్, స్టాండ్లీ, దిలీప్, పాండి, రాజేంద్ర, సుబ్రమణి, జయచంద్ర, సుబ్రమణ్యం, మూర్తి, వైస్ ఎంపీపీ జయరాం పాల్గొన్నారు.

రోజువారీగా టోకెన్లు పంపిణీ



పరిశ్రమలో పల్ప్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

పూతలపట్టు (యాదమరి): రైతులకు రోజువారీగా టోకెన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆయన ఆదివారం పూతలపట్టు మండలం గల్లా ఫుడ్స్ పరిశ్రమను సందర్శించారు. అక్కడ తయారవుతున్న పల్ప్ ఉత్పత్తులను పరిశీలించారు. మ్యాంగో పల్ప్, మ్యాంగో జ్యూస్ పైన ప్రస్తుతం ఉన్న 12% జీఎస్టీని ఐదు శాతానికి తగ్గిస్తామన్నారు. దీనివల్ల వినియోగం పెరిగి డిమాండ్ పెరుగుతుందని పరిశ్రమ యజమానులకు తెలిపారు. అనంతరం అన్‌లోడింగ్ కోసం ట్రాక్టర్లతో వేచి ఉన్న రైతులతో సంభాషించారు. జిల్లా నలుమూలల నుంచి మండలంలోని మ్యాంగో ఫ్యాక్టరీలకు వస్తున్న మామిడి రైతులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏ రోజుకారోజు టోకెన్లను పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

బడిబాట కాగితాల్లోనే..!

- ఆ 15,879 మంది ఎక్కడున్నారో తెలియని వైనం
- డ్రాప్‌బాక్స్ లెక్కలతో సమగ్రశిక్ష శాఖ అధికారుల హడావుడి
- క్షేత్రస్థాయిలో ఫలితాలు మాత్రం శూన్యం



విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న పాలవాకనపల్లి పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు. (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు ఉన్న పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలి. అయితే జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థులు చదువుకు దూరంగా ఉన్నారు. అయినప్పటికీ జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో వేల సంఖ్యలో విద్యార్థులు చిన్నతనంలోనే బడికి దూరమై కార్మికులుగా మారుతున్నారు. ఈ విషయం పలు సర్వేలు సైతం వెల్లడిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6–14 ఏళ్ల వయసు ఉండి బడిలో చేరి మధ్యలో చదువు మానేసిన వారి సంఖ్య అధికారికంగా 15,879 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అయితే జిల్లాలో మాత్రం ఆ దిశగా చర్యలు మాత్రం ముందుకు సాగడం లేదు. తమకేమీ ఆ ఉత్తర్వులు పట్టవనే చందంగా సమగ్రశిక్ష శాఖ అధికారులు ఉదాసీన వైఖరి అనుసరిస్తున్నారు. బడి బయట పిల్లల అంశంపై కలెక్టర్ సైతం పలు మార్లు సమావేశాల్లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ జిల్లాలో బడిబాట కార్యక్రమం ఊసే లేదు.

కలెక్టర్ దృష్టి పెట్టాల్సిందే

జిల్లా వ్యాప్తంగా కొంత మంది విద్యార్థులను బలవంతంగా బడుల్లో చేర్పించినట్లు అధికారులు చెబుతున్నారు. బడుల్లో చేర్పించినప్పుడు మాత్రం ఫొటోలు తీసి అధికారులకు పంపి చేతులు దులుపుకుంటున్నారు. బడిబయటి పిల్లల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారో సైతం తెలియని దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన విషయం అందరికీ తెలిసిందే. అప్పుడు ప్రభుత్వ బడులకు ఆకర్షితులైన తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు.

పాఠశాలల విలీనం.. విద్యకు దూరం

జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే పనిచేపట్టారు. దీంతో వేలాది మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమవుతున్నారు. సొంత గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను దాదాపు 8 నుంచి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లోకి విలీనం చేశారు. దీంతో తల్లిదండ్రులు నిత్యం తమ పిల్లలతో ఎక్కడికక్కడ ధర్నాలు చేస్తూనే ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం గమనార్హం.